## మ్యాన్‌హోల్‌లోని మురుగునీటి తొలగింపు

● హర్షం వ్యక్తం చేసిన సాయిదీప్ అపార్ట్‌మెంట్‌వాసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): జలమండలి పరిధిలోని డీడీ కాలనీలోని గోల్నాక తిరుమలనగర్‌లో గల సాయిదీప్ అపార్ట్‌మెంట్ వాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యకు మోక్షం లభించింది. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం 'తాగునీరు కలుషితం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి డీడీకాలనీ జలమండలి అధికారులు స్పందించి ఆదివారం సాయిదీప్ అపార్ట్‌మెంటు వద్ద మ్యాన్ హోల్‌లోని మురుగునీటిని తొలగించారు. కలుషిత నీటికి కారణమైన మ్యాన్‌హోల్‌ను మూసివేసి, మళ్లీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని జలమండలి మేనేజర్‌రోహిత్ తెలిపారు. ఈ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి సాయిదీప్ అపార్ట్‌మెంట్‌వాసులు రాజేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల్లో భక్తిభావన పెంచిన ఆదిశంకరాచార్య



సమావేశంలో ప్రసంగిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు

చిక్కడపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): కాలినడకన కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పర్యటించిన ఆది శంకరాచార్యులు నాలుగు శక్తి పీఠాలు స్థాపించి ప్రజల్లో భక్తి భావన పెంచారని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ఆదివారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గానసభలో జగద్గురు ఆది శంకరాచార్య సంస్మరణ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ అన్నిజీవులలో ఆత్మ వుంటుందని అదే దైవత్వం అని అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన తత్వవేత్త ఆది శంకరాచార్యులు అన్నారు. హిందూమతాన్ని ఉద్ధరించిన త్రిమతాచార్యులలో ప్రథములు ఆది శంకరాచార్యులు అని వివరించారు. సమకాలీన హిందూమతం ఆలోచనా సరళిపై అత్యంత ప్రభావం కలిగిన సిద్ధాంతవేత్త అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డా. ఎస్‌పీభారతి, సంగీత గురువు మల్లాది ఉష, గానసభ పాలకవర్గ సభ్యుడు శ్రీనివాస్ ద్రావిడ పాల్గొన్నారు.

## కూలిన భారీ వేపచెట్టు



కూలిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ముషీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ లోని మోహన్‌నగర్‌లో ఆదివారం భారీ వేపచెట్టు కూలింది. చెట్టుకొమ్మలు ఇంటి ప్రహరీపై పడడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయమై ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూలిన చెట్టు కొమ్మలను యంత్రాల సాయంతో కట్ చేసి తొలగించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కొండా శ్రీధర్‌రెడ్డి సూచించారు.

## వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

చిక్కడపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం జవహర్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజలు, కార్యకర్తలను కలిశారు. నియోజకవర్గంలో వర్షం ప్రభావం అధికంగా ఉంటుంది కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## మూఢనమ్మకాలను నమ్మొద్దు



సదస్సులో మాట్లాడుతున్న విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్ తదితరులు

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలను నమ్మొద్దని, సమాజంలో మూఢనమ్మకాలు ఎంత ఎక్కువగా ఉంటే ఆ సమాజం అంతగా మానసిక బానిసత్వంలో మగ్గుతుందని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్ పేర్కొన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) ఆధ్వర్యంలో విద్యా వైజ్ఞానిక తరగతుల్లో మూఢనమ్మకాలు, సైన్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.హన్మేష్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, నాయకులు ఎం.రవికుమార్, ఎం.నాగేశ్వర్‌రావు. బీఎస్ కృష్ణ, కిరణ్, మల్లేష్, బంగారు శ్రీనివాస్, ఎల్లప్ప, బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గూడ్స్ కారియర్ వాహనం ఢీకొని అనస్థీషియా టెక్నీషియన్ మృతి

కవాడిగూడ, మే 19 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన గూడ్స్ కారియర్ వాహనం ఢీకొని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనస్థీషియా టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన దోమలగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని ట్యాంక్‌బండ్‌పై బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద ఆదివారం తెల్లవారుజామున 3.10గంటలకు జరిగింది, సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా బెజ్జెంకి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన కొన్నె శ్రీనివాస్‌కుమారుడు కొన్నె అజయ్(26) అంజయ్యనగర్‌లోని శ్రీకార్ ఆస్పత్రిలో అనస్థీషియా టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై సికింద్రాబాద్ రాణిగంజ్ నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న గూడ్స్ కారియర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజయ్ కిందపడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అజయ్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. గూడ్స్ కారియర్ వాహనానిన స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రైవర్ పొన్నకుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

## చుడీదార్, ముసుగులు ధరించి చోరీ

● తాళాలు పగులగొట్టి బంగారం, నగదు అపహరణ

అమీర్‌పేట, మే 19 (ఆంధ్రజ్యోతి): చుడీదార్, ముసుగులతో మహిళల వేషధారణలో అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన దొంగలు ఫ్లాట్ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జెక్‌కాలనీలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జెక్‌కాలనీ ఆకృతి ఆర్కేడ్‌లో ప్రైవేట్ ఉద్యోగి వేంకటేశ్వర్‌రావు ఉంటున్నారు. అదే అపార్ట్‌మెంట్‌లోని మరో ఫ్లాట్‌లో ఆయన కుమార్తె, అల్లుడు ఉంటున్నారు. ఈనెల 16న రాత్రి వేంకటేశ్వర్‌రావు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఒంగోలు వెళ్లారు. 18వ తేదీన పని మనిషి వేంకటేశ్వర్‌రావు కుమార్తె ఇంటికి వెళ్లి తాళపుచెవి తీసుకుని ఆయన ఇంటిని శుభ్రం చేసేందుకు వెళ్లింది. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉండడం, ఇంట్లోని సామగ్రి చిందర వందరంగా కనిపించడంతో వేంకటేశ్వర్‌రావు కుమార్తెకు విషయం చెప్పింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అల్మారాలో దాచిన 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, ఓ ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అపార్ట్‌మెంట్‌లోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా 18న తెల్లవారు జామున చుడీదార్, ముసుగులు ధరించి మహిళల వేషధారణలో ఇద్దరు ఆగంతుకులు ప్రవేశించి, ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు కనిపించింది. కేసు దర్యాప్తులో ఉంది.

## మహిళ అదృశ్యం



జ్యోతి

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అదృశ్యమైంది. నల్లకుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మాకాలనీలో గల అంజనేయస్వామి దేవాలయం వద్ద గల ఓ అపార్ట్‌మెంట్‌లో కె.రవి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జ్యోతి(23) శనివారం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం భర్త ఎక్కడ వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె తల్లి నాగలక్ష్మి తన కూతురు జ్యోతి కనిపించడంలేదని నల్లకుంట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. జ్యోతిని ఎవరైనా గుర్తిస్తే నల్లకుంట పోలీసులకు లేదా ఫోన్ నం.7981536766లో తెలియజేయాలని ఎస్ఐ రమాదేవి పేర్కొన్నారు.

# ఆ విద్యార్థులను పట్టించుకోరా..?

● పదో తరగతిలో మూడు జిల్లాల్లో 19,114 మంది ఫెయిల్

● ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తల్లిదండ్రుల వినతి



**ప్రత్యేక చొరవ కరువు**

విద్యార్థి జీవితానికి పదో తరగతి తొలిమెట్టు. వారి విషయంలో తల్లిదండ్రుల కంటే విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపించాలి. వారిని మళ్లీ పరీక్షలకు సిద్ధం చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. జూన్ 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ఎస్ఎస్‌సీ బోర్డు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు.

హైదరాబాద్ సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారికి మనోధైర్యం కల్పించి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయించాల్సిన విద్యాశాఖాధికారులు తమకేంపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మరో రెండు వారాల్లో సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఫెయిలైన విద్యార్థుల్లో మనోధైర్యం కల్పించి.. వారు పాస్ అయ్యేలా ఎటువంటి చర్యలు లేవు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో సప్లిమెంటరీలో కూడా ఉత్తీర్ణత సాధించే పరిస్థితి కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 73,202 మంది విద్యార్థులు హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 50,811 మంది, మేడ్చల్ జిల్లాలో 46,736 మంది పరీక్ష రాశారు. హైదరాబాద్‌లో బాలురు 83.41 శాతం పాస్ కాగా.. అమ్మాయిలు 89.90 శాతం ఉత్తీర్ణత సాధించారు. రంగారెడ్డిలో బాలురు 88.89 శాతం, బాలికలు 93.32 శాతం మంది పాసయ్యారు. మేడ్చల్‌లో 87.35 శాతం బాలురు పాస్ కాగా.. బాలికలు 92.03 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

**గణితం, సైన్స్‌లోనే ఎక్కువగా ఫెయిల్**

హైదరాబాద్ జిల్లాలో మొత్తం 73,202 మంది పరీక్ష రాస్తే.. 63,511 మంది పాస్ కాగా, 9,691 మంది ఫెయిలయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 50,811 మంది పరీక్ష రాస్తే.. 46,245మంది పాస్ కాగా, 4,566 మంది ఫెయిలయ్యారు. మేడ్చల్ జిల్లాలో 46,736 మంది పరీక్షకు హాజరుకాగా, 41,879 మంది పాసయ్యారు. 4,857 మంది ఫెయిలయ్యారు. మూడు జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కలిపి 19,114 మంది ఫెయిలయ్యారు. ఆయా జిల్లాల్లో ఉత్తీర్ణత పొందిన వారిలో ఎక్కువగా ప్రైవేట్, గురుకుల పాఠశాలల విద్యార్థులుండడం గమనార్హం. ప్రైవేట్ విద్యార్థులను మినహాయిస్తే హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 5,153 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఫెయిలైనట్లు విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో చాలామంది గణితం, సైన్స్, ఆంగ్లం, తెలుగు, హిందీలో ఫెయిలయ్యారు. ఉపాధ్యాయుల బోధన తీరును పర్యవేక్షించే వారు లేకపోవడంతో మొక్కుబడిగా పాఠాలు చెబుతున్నారని విద్యావేత్తలు ఆరోపిస్తున్నారు.

# ప్రభుత్వాస్పత్రుల్లో పిల్లల వైద్యుల కొరత..

హైదరాబాద్ సిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో నాలుగు పెద్ద ప్రసూతి ఆస్పత్రులు, ఐదు ఏరియా మెటర్నిటీ ఆస్పత్రులు, మరో ఆరు ప్రాంతీయ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో రెండు పెద్ద ఆస్పత్రులు (గాంధీ, నిలోఫర్) మినహా ఇతర ఆస్పత్రుల్లో పిల్లల వైద్యులు లేరు. ముఖ్యంగా ప్రసూతి ఆస్పత్రుల్లో తప్పనిసరిగా పిల్లల వైద్యులను నియమించాలి. పుట్టిన బిడ్డకు వెంటనే చికిత్సలు అందించాల్సి ఉన్నా పిల్లల వైద్యుడు అందుబాటులో లేకపోవడం వల్ల మరో ఆస్పత్రికి పరుగులు తీయాల్సి వస్తోంది.

**పరీక్షలు చేయాలి**

ప్రసూతి ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన శిశువులకు పిల్లల వైద్యుడు తప్పనిసరిగా పరీక్షలు చేయాలి. ఏవైనా లోపాలు ఉన్నాయా.. అనారోగ్య సమస్యలు ఉన్నాయా అన్నది పరిశీలించాలి. అంతేకాకుండా పిల్లలకు జబ్బు చేస్తే వెంటనే చికిత్స అందించాలి. కానీ, ప్రసూతి ఆస్పత్రిలో శిశువులకు వైద్యం చేసేందుకు పిల్లల వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. పిల్లలకు అత్యవసర వైద్యం కావాలంటే నిలోఫర్, గాంధీ ఆస్పత్రులకు ఉరుకులు, పరుగుల మీద తరలించాల్సి వస్తోంది. రోజుకు 30నుంచి 40 వరకు ప్రసవాలు జరిగే ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల్లో 24 గంటల పాటు అందుబాటులో పిల్లల వైద్యులు ఉండడం లేదు. ఉదయం వచ్చి మధ్యాహ్నం వెళ్లిపోతుండడంతో పిల్లలను మరోచోటకు తరలించాల్సి వస్తోంది.

**ప్రాథమిక ప్రసూతి ఆస్పత్రిలోనూ అంతే..**

నగరంలో లాలాపేట, పానీపుర, శ్రీరాంనగర్, జంగమ్మెట్, అంబర్‌పేటల్లోని ప్రసూతి ఆస్పత్రుల్లో కూడా ఇదేతీరు ఉంది. ఇక్కడ రోజుకు 30 నుంచి 50 వరకు ప్రసవాలు జరుగుతాయి. ఇక మలక్‌పేట, కింగ్ కోఠి, గోల్కొండ, శాలిబండ, బార్కస్, నాంపల్లిలోని ఏరియా ఆస్పత్రుల్లో కూడా నిత్యం అత్యధిక ప్రసవాలు జరుగుతుంటాయి. ఇక్కడ కూడా ఒక్క పిల్లల వైద్యుడూ లేడు.

# దాడులకు పాల్పడడం సరికాదు : కిషన్‌రెడ్డి



దాడికి గురైన లక్ష్మణ్‌ను పరామర్శిస్తున్న కిషన్‌రెడ్డి

ముషీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): దాడులకు పాల్పడడం, కులంపేరుతో దూషించడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు.. బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ దాడికి గురైన విషయం తెలుసుకున్న కిషన్‌రెడ్డి ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో గల బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. దాడులకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ రోజు స్థానికుడైన బీఆర్‌ఎస్ నాయకుడు కులంపేరుతో దూషించి తనపై అకారణంగా దాడి చేశాడని కిషన్‌రెడ్డికి లక్ష్మణ్ వివరించారు. బలమైన దెబ్బలు తగలడం వల్ల ముక్కు దెబ్బతిన్నదని డాక్టర్లు ఆపరేషన్ చేయాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. స్పందించిన కిషన్‌రెడ్డి వెంటనే వైద్యశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. దాడిచేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్, బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సీకే శంకర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్. విశ్వం, నర్సింహ, అశోక్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రవి కుమార్, ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

**గొడవకు రాజకీయ రంగు**

భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో దాడి చేసిన బీఆర్‌ఎస్ నాయకుడు, దాడికి గురైన బీజేపీ నాయకుడు లక్ష్మణ్ ఒకే వీధిలో ఉంటారు. ఇద్దరు వేరు వేరు పార్టీలు కావడం గతంలో కూడా ఇద్దరి మధ్య జరిగిన గొడవలు తోడవడంతో ఎన్నికల రోజు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో తనను కులం పేరుతో దూషించి దాడి చేశాడని లక్ష్మణ్ ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితునికి మద్దతుగా బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు తరలిరావడం బీఆర్‌ఎస్ నాయకుడికి మద్దతుగా పెద్ద ఎత్తున ఆ పార్టీ నాయకులు తరలిరావడంతో ఇరువురి మధ్య ఆధిపత్య పోరుతో కేసుల నామోదు వరకు వెళ్లింది. దీంతో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య మరింత వివాదం పెరిగి రాజకీయ రంగు ఈ దాడిని ముదిరేలా చేసింది.

# ఆదర్శ ప్రజా నేత పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆర్.వివేక్, సైలాబ్, వెంకటస్వామి తదితరులు

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల ఫైళ్లను తన సైకిల్‌స్టాండ్‌కు కట్టుకొని, సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లిన ఆదర్శ ప్రజా నేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు రూపుల వివేక్ అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో గల ఆయన విగ్రహానికి వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య పోరాటంలో పుచ్చలపల్లి పాల్గొన్నారని తెలిపారు. నిజాం ఆరాచక పాలనకు వ్యతిరేకంగా, భూస్వాముల దాష్టికాలకు వ్యతిరేకంగా జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. తన తుదిశ్వాస వరకు ఆయన ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, విశ్రాంత అధ్యాపకుడు వి.నాగభూషణం, ఎస్.రమేష్‌రెడ్డి, నాయకులు సైలాబ్‌బాబు, కిషన్‌రావు, రవికుమార్, సాగర్‌రెడ్డి, రాఘవరెడ్డి, మనోహర్‌రెడ్డి, కె.నర్సింహ, రాజశేఖర్ రెడ్డి, నారాయణగౌడ్, అంజయ్య, సాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి

● బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

చిక్కడపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు 23 శాతం ఉన్న రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీనిచ్చిందని గుర్తుచేశారు. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 60 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీలలో వీసీల నియామకాల్లో బీసీలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాజేష్, రంగు క్రాంతి, నాయకులు అఖిల్, మహేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## వీసీలు, డైరెక్టర్ల నియామకాల్లో బీసీలకు 50శాతం పదవులు కేటాయించాలి

●జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

బర్కత్‌పుర, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నియమించబోయే యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్లు, డైరెక్టర్ల నియామకాల్లో 50 శాతం పదవులు బీసీలకే కేటాయించాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు పదవుల కేటాయింపులో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని దానికి కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం కార్యదర్శి హేమంత్, సలహాదారులు బాల్‌రాజ్‌గౌడ్, బిక్షపతి, వెంకటాద్రి, రఘుచారి తదితరులు పాల్గొన్నారు.

## 'సాయిరాం ఫైనాన్స్ కంపెనీపై చర్య తీసుకోవాలి'

బర్కత్‌పుర, మే 19 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశచూపి డబ్బులు డిపాజిట్ చేయించుకొని ప్రజలను మోసం చేసిన శ్రీ సాయిరాం ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యంపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నేతల అండదండలతో ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బాధితులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని యాభై గ్రామాలకు చెందిన 2,500 మంది ప్రజలు పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు, ఇళ్లు కోల్పోయారని, వారికి అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారాన్ని శ్రీ సాయిరాం ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం అధిక వడ్డీ ఆశ చూపి రూ.150 కోట్లు డిపాజిట్లు చేయించుకుందని ఆరోపించారు. మూడేళ్ల గడుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా బాధితులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని బాధితులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో బాధితులతో పాటు బీసీ సంఘాల నాయకులు సి.రాజేందర్ ముదిరాజ్, జి.అనంతయ్య, పోల్కం శ్రీనివాస్, జ్యోతి, భాగ్యలక్ష్మి, బలరాం పాల్గొన్నారు.

## భార్య నుంచి రక్షణ కల్పించాలి

● పోలీసులను కోరిన బాధితుడు

బర్కత్‌పుర. మే 19 (ఆంధ్రజ్యోతి): భార్య నుంచి తనకు, తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని బాధితుడు టిమూజియస్ కోరాడు. ఆదివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తన శరీరంపై భార్య చేసిన గాయాలను చూపించాడు. ఏపీలోని అమలాపురానికి చెందిన తనకు రాజోలుకు చెందిన లక్ష్మీగౌతమితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగిందని, తమకు ఐదేళ్ల కుమారుడు ఉన్నాడని ఆయన చెప్పారు. పెళ్లయిన నాటినుంచి భార్య తనను అకారణంగా హింసిస్తుందని, పెద్దల సమక్షంలో మాట్లాడినా ఆమె తీరు మార్చుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల తనను చంపేందుకు కత్తితో దాడిచేసిందని, అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు తన భార్యపై కేసు నమోదు చేసి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

## కీర్తనలతో వేంకటేశ్వరున్ని దర్శించుకున్న అన్నమయ్య

చిక్కడపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): భక్తితో 32వేల కీర్తనలు రచించి గానం చేసి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్న మహానుభావుడు, వాగ్గేయకారుడు అన్నమయ్య అని వక్తలు పేర్కొన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం త్యాగరాయగానసభలో పదకవితాపితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య 616 జయంతి మహోత్సవం సందర్భంగా సంగీత నాట్యనీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌బాలభవన్ మాజీ డైరెక్టర్ డా. ఎంకే రాము మాట్లాడుతూ అన్నమయ్య రచించిన కీర్తనలు భక్తిని పెంచుతాయని అవి పాడుకోవడానికి ఎంతో మధురంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గాయని శ్రీమణి, నాట్యగురువు పండిట్ అంజిబాబు, రంగస్థల నటుడు దామోదరం నాగేందర్, చిక్కడపల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య, నిర్వాహకులు జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాట్యగురువుల శిష్యులు శాస్త్రీయ నృత్యాలను ఆకట్టుకునేలా ప్రదర్శించారు.

## 'మల్టీస్కిల్స్ ఉన్నవారు ఏ రంగంలోనైనా రాణిస్తారు'

చిక్కడపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): మల్టీస్కిల్స్ ఉన్నవారు మాత్రమే ఏ రంగంలోనైనా రాణిస్తారని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని ఉత్తర అమెరికా తెలుగు సంఘం సహకారంతో అవని ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఈ డిజిటల్ యుగంలో టెక్నాలజీ లేకుండా ఏ రంగం అభివృద్ధి కాదన్నారు. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. నాట్స్ డల్లాస్ కో ఆర్డినేటర్ రవి తాండ్ర, రామానంద తీర్థ గ్రామీణ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ ప్రొ. కిషోర్‌రెడ్డి, స్పర్శ ఫౌండేషన్ సీఈవో పంచముఖి, సీనియర్ జర్నలిస్ట్ వీరయ్య, తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కోయ చంద్రమోహన్, ఏఐటీయూసీ నాయకులు బాలకాశి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శవంత పాత్రికేయులు మాదాల: జనార్దనమూర్తి

చిక్కడపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): ఆదర్శవంత పాత్రికేయులు మాదాల వీరభద్రరావు అని త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అన్నారు. నమ్మిన సిద్ధాంతాలను ఆచరించిన ఆయన ఎలాంటి రాజీ లేకుండా తన వ్యాసాలతో ప్రజలను జాగృతం చేశారన్నారు. గానసభలో ఆదివారం సాయంత్రం మాదాల వీరభద్రరావు స్మారక సమితి, సాధన సాహితీస్రవంతి, మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మాదాల వీరభద్రరావు 105వ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనార్దనమూర్తి ఈ సందర్భంగా మాదాల వీరభద్రరావు స్మారక పురస్కారాన్ని సీనియర్ జర్నలిస్ట్ రాయప్రోలు రమణకు బహూకరించారు. పురస్కార ప్రదాత మాదాల రాజేంద్రప్రసాద్, కవి రఘుశ్రీ, రామచంద్రరావు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో సోమవారం విద్యుత్‌సరఫరా ఉండదని సీబీడీఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. గగన్‌మహల్ 11కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, దోమలగూడ పరిధిలో 10నుంచి 11 వరకు, గుల్షన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30గంటల వరకు, దత్తానగర్ పరిధిలో 4 గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

● ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో భారీ కటౌట్‌లు ఏర్పాటు





థియేటర్ ప్రాంగణంలో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కటౌట్‌లు

చిక్కడపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సుదర్శన్ 35ఎంఎం, దేవి థియేటర్‌ల ప్రాంగణంలో ఆదివారం రాత్రి ప్రముఖ సినీహీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం బర్త్‌డే వేడుకలుండగా ఒకరోజు ముందుగానే సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన నటించిన ఆది సినిమాకు సంబంధించిన భారీ కటౌట్‌తోపాటు తాజాగా తీస్తున్న దేవర సినిమా భారీ కటౌట్‌ను కూడా ఈ సందర్భంగా సుదర్శన్ థియేటర్ ప్రాంగణంలో అభిమానులు ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుత్‌దీపాలు, డీజేలు ఎన్టీఆర్ చిత్రాల్లోని పాటలతో అభిమానులు సందడి చేశారు. ఎన్టీఆర్ నటించిన దేవర సినిమాకు సంబంధించిన ఓ పాట ట్రైలర్‌ను కూడా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్‌తోపాటు థియేటర్‌ల మేనేజింగ్ పార్టనర్ బాల్‌గోవింద్‌రాజు, మేనేజర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

## పటిష్ఠమైన ప్రణాళికతో చదివితే సివిల్స్‌లో రాణించడం సులభమే

రాంనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): పటిష్ఠమైన ప్రణాళికతోపాటు సరైన శిక్షణ తీసుకుంటే సివిల్స్ పరీక్షల్లో రాణించడం సులభమేనని ఏసీఈ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శివతేజ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏసీఈ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఐఏఎస్, ఐపీఎస్ అభ్యర్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శివతేజ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా తమ సంస్థలో సివిల్స్‌లో శిక్షణ పొంది జాతీయ ర్యాంకులు సాధించిన తొమ్మిది మంది ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్‌లు ఉన్నారని తెలిపారు. అనంతరం ఐఏఎస్, ఐపీఎస్ సాధించిన అభ్యర్థులు మాట్లాడారు. వారి విజయాలకు గల కారణాలను అభ్యర్థులకు వివరించారు. కార్యక్రమంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

## చుట్టుముట్టి బంగారు గొలుసు స్నాచింగ్

బంజారాహిల్స్, మే 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు దిగుతుండగా మద్యం మత్తులో నలుగురు చుట్టుముట్టి బంగారు గొలుసును స్నాచింగ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11లో నివసించే యష్‌దాస్ ఈ నెల 17న పని నిమిత్తం మెహిదీపట్నం వెళ్లి తిరిగి ఆర్టీసీ బస్సులో బంజారాహిల్స్ రోడ్డు నంబర్- 1కి చేరుకున్నాడు. బస్టాప్‌లో బస్సు దిగుతుండగా మద్యం మత్తులో నలుగురు ముట్టడించారు. అతడిని దృష్టిమళ్లించే ప్రయత్నం చేశారు. వారి నుంచి తప్పించుకున్న యష్‌దాస్ మరుసటి రోజు తన మెడలో ఉన్న బంగారు లాకెట్‌తో కూడిన గొలుసు కనిపించలేదు. ఇంట్లో వెతికినా ఫలితం లేదు. బస్సులో ముట్టడించిన వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.